"కులట!"

కుటుంబ పరిస్థితులు అతిక్లిష్టంగా వున్నాయి. ఊరినిండా అప్పులూ—చేతులో దమ్మిడీ కూడా లేకపోవటమూ—ఆరేళ్ళ తమ్ముడు మినహాగా 'నా' అనేవాళ్ళే కరువౌటమూ-పూటకూటికి మాడుతూ కూర్చోటమూ—పై పెచ్చు వారం రోజుల్నుంచీ చిన్న తమ్ముడికి తీవ్రంగా జ్వరం తగులుతూ వుండటమూ—ఇవన్నీ ఒక్కసారిగా మిన్ను విరిగి మీద పడ్డట్లు—మాలతిని వేపుకుతింటూన్న తీరని సమస్యలు. ఇవన్నీ పరిష్కరించబడేందుకు కావాల్సింది ఒక 'ధనమే!' ఆ ధన సంపాదనకేగా—యీ జనం తిరుగులాడటం!

డబ్బులేని తనకు ఏడాక్టరు సహాయంచేస్తాడు? ఏవిధంగా తను తన తమ్ముణ్ణి ఆదరించగలదు? ఒకప్పుడు తన జీవితం-ఏ భర్త చేతుల్లో రాణిస్తుందని భ్రమపడ్డదో—ఆ ప్రబుద్ధుడు చల్లగా స్వర్గం చేరుకున్నాడు! తన జీవితమే తనకొక తీరని సమస్యగావుండగా—ఆతమ్ముడు— వాడుకూడా తనకొక గుదిబండ! సూర్యచంద్రులు నివసిస్తూన్న ఆపూరిపాక మినహాగా ఏ ఆస్తీ లేని తనకోసం ఎవరు నిట్టూర్పు విడుస్తారు?

కుటుంబ గౌరవంకూడా తన 'ధనం'తో పాటే హారతి కర్పూరంలాగు హరించుకు పోయింది! ఇంతమందికీ కూడు పెడుతూన్న ఆదైవం దృష్టికి—తన తమ్ముడూ తనూ దూరమై పోయినట్లుగా వుంది! తనలాటి వాళ్ళను యీ భూమాత ఇంకెన్నాళ్ళు మొయ్యాలో?

కుర్రవాడు మూలుగుతూ, "జా—వ!" అన్నాడు. ఎక్క-

ఉన్నుంచి వెతుక్కు వస్తుంది—జావ? తమ్ముడు నిరుత్సాహ పడకుండా, "తెస్తాను నాయనా!" అంది.

"ఇప్పుడే!" అన్నాడు కుర్రవాడు.

తమ్ముడి తలను తాకుతూ, "ఇప్పుడే తెస్తాను" అంది. వాడు సమాధాన పడ్డట్టు తలవూపి, ఏదో బాధతో కళ్లు మూశాడు. వాడికోసమే తను ఒకికిఫ్రంద! వాడికోసమే— బరువైనకాళ్ళను యీడ్చుకుంటూ మెల్లిగా బజారులో పడ్డది.

పట్టణంలోని ఎలక్ట్రిక్ లైట్లు అవిచ్ఛిన్నంగా కాంతిని ప్రసరింప జేస్తున్నాయి. షికారువెళ్ళి చల్లగాల్ని మేసి వస్తూన్న పెద్దమనుషు లందరూ, తనను చూడకుండానే సాగిపోతున్నారు. చూచిన ఒక రిద్దరూ 'నీఖర్మం అంతే!' అన్నట్లు నవ్వి చుర చురా చూస్తూ చర చరా సాగిపోతున్నారు. తన నీడను మాత్రం తోడుగా తీసుకొని మెల్లిగా అలసి, సొలసి వీధి చివరి కోమట్లదగ్గరకు చేరింది.

షాహుకారు ఆమెను తేరి పారజూచి, "ఏమమ్మా! పాతబాకీ ఇంకా జమకట్టనే లేదుగదా!" అన్నాడు.

"ఇస్తాను బాబూ! ఒక్కణా గోధుమ నూకను ఇద్దూ?"

"చాల్చాల్లే—ఇదేమన్నా వ్యాపారమా? గోంగోర పచ్చడా? వెళ్ళవమ్మా—వెళ్లు; ఎవరన్నా వింటే నవ్వుతారు—"

ఒకప్పుడు సకల సౌఖ్యాలీ! అనుభవించిన తనకు ఎంత పరాభవం! వంచిన తలను ఎత్తకుండా, నిరుత్సాహంగా—గమ్యస్థాన నిర్ణయం లేకుండానే బయలుదేరింది! ఆమె సౌఖ్య దినాలన్నీ కళ్ళకు కట్టినట్టుగా ఉన్నాయి. అధమం వాటిని

మరచిపో గలుగుతే ఆమెకు కొంతమనశ్శాంతి ఏర్పడివుండేది కాని, ఇది మానవాతీతమైన విషయం! చీకట్లో ఎవరూ చూడకుండా కన్నీళ్ళను ఒత్తుతూన్న చీరకొంగు ఎప్పటికప్పుడే బాగా తడిసిపోయింది!

తను మాడినా—చచ్చినా—తమ్ముడి గతేమిటి? మందుల్నీ మాకుల్నీ పొయ్యలేకపోయినా తను వాడికి జావనుకూడా కాచి ఇవ్వలేని స్థితికి వచ్చింది! మానవ జన్మ ఎత్తికూడా—కొరగాని తృణాల్లో తనే ప్రథమురాలై వుంటుందని ఆమె నమ్మింది! ఇంత విశాల విశ్వంలో 'దయ' అనే పదార్థం యీనాడు తనకు—కంచు కాగడాలు వేసి వెతికినా—ఎక్కడా కన్పించేట్టు లేదు! సముద్రుడు మాత్రం—చందమామను చూచి—తనలాగే ఘోషిస్తున్నాడు! కాని తనను కనడు; వినడు!

2

చేతులోవున్న స్టెతాస్కోపును చూచి డాక్టరని భ్రమపడి వుంటుంది.

“డాక్టరుగారూ!”

“ఏం కావాలి?”— తీక్షణంగా చూశాడా యువకుడు.

“మా తమ్ముడికి వారం రోజుల్నుంచీ జ్వరం—” పొడి గొంతుకతో చెప్తోంది.

పరీక్షగా ఆమెను చూస్తూన్న అతనికి, ఆమెలో ఏమాధుర్యం కన్పించిందో కాని, “నన్ను వచ్చి చూడమంటావా?” అన్నాడు.

ఎంత మధురంగా అడిగాడు ! ఆమె తల వూపింది— ఒక విధమైన ఉత్సాహాన్ని కనబరుస్తూ.

"ఏమిస్తావు ?" ఈ ప్రశ్న ఏ డాక్టరు దగ్గరా తప్పేట్టుగా లేదు ! తను ఎవరికేం ఇవ్వగలదు ? ఎవరైనా తనకు ప్రాణ దానం చేసినా—వారికి ఈ జన్మలో మాత్రం తను కృతజ్ఞ రాలవలేదని ఆమెకు తెలుసు ! మానవుల్లో వున్న ధనతృష్ణ సంగతి ఆమెకు తెలియకపోతేగా !

" నాదగ్గరేముంది ఇచ్చేందుకు ? "

" నాకు కావాల్సిందే—ఇస్తే— ?"

"నాదగ్గరా ? ఏం కావాలి ?" అమాయకంగా ఆమె అడిగింది.

"నువ్వు కావాలి — "

తనేం తప్పు చేసిందని— తనను అందరూ ఇంత తేలిగ్గా చూస్తున్నారు ? తన వెనుక ఎవ్వరూ లేరనేగా ఈ యువకుడు తనను కోరగలగాడు ! స్వార్థమనేది ప్రతి చిన్న సహాయానికీ — నీడలాగు అంటి పెట్టుకు వుండాల్సిందేనా ? ఇన్నాళ్ళూ మానవులు ఒక్క డబ్బుకే ఆశిస్తున్నారని తను తలిచింది.—పొరపాటై వుండాలి. తన శరీరాన్ని చూచుకుంది; ఎంత మలినంగా వుంది ! ఉదయాన అద్దంలో చూచుకున్న తన ప్రతిబింబం తననే వెక్కిరించింది; 'ఇంత వికృతంగా తయారయ్యావేం ?' అన్నట్టు కృశించి, వాడిన తన ముఖం తననుచూసి నవ్వింది ! ఈలోకానికి తను పనికివచ్చే విధానం ఇది ఒక్కటేనేమో ? ఈ డాక్టరుగారికి తను మానాన్ని బలి ఇవ్వటమే ఫీజు ! ఆమె అరచేతుల్లో ముఖాన్ని దాచుకొని

వల వలా ఏడ్చింది.

"ఏదో ఒకటి తేల్చుకో త్వరగా—"

"నన్నెందుకు అపవిత్రం చేస్తారు? నన్నెందుకు బాధిస్తారు? నన్ను క్షమించండి — మీ కాళ్లు పట్టుకుంటా." ఆత్మాభిమానాన్ని పూర్తిగా చంపుకు మాట్లాడిన ఆమె మాటలకు అరాళ్లు కరిగి వుండేవేమో కాని, ఆపరేషన్లకు అలవాటుపడ్డ డాక్టరుగారి మొండిగుండెకు ఏ చలనమూ కలుగలేదు!

"ఈ నల్లి బొల్లి యేడ్పులకేం—నువ్వు మహా పతివ్రతవైనట్టుగా మాట్లాడుతావేం? అయినా నాకెందుకు ఈ అనవసరపు తెగలాటకం?"—డాక్టరు దబాయించి రెండు అడుగులు ముందుకు వేశాడు.

తన తమ్ముడూ, వాడు తనవైపు దీనంగా, జాలిగా, బాధగా చూసి, 'అక్కా!' అని కష్టంగా పిలవటమూ—అన్నీ ఆమెకు ఒక్కసారిగా కళ్ళముందు జరుగుతూన్నట్టనిపించింది. తను తప్ప తన తమ్ముడికి ఇంకెవరున్నారు? లోకం దృష్టిలో తన ధనంతో పాటు తన పాతివ్రత్యంకూడా జారుకోబట్టేగా—తనముఖ కళనూ, దుస్తుల తీరునూ పట్టి యీ 'సైకాలజిస్టు' తన నొక 'కులట'గా జమకట్టగలిగింది! తను పాతివ్రత్య ధర్మాన్ని త్రికరణశుద్ధిగా నిలబెట్టుకోగలిగితే మాత్రం తనకు జరిగే దేమిటి? లోకం తన నేమన్నా పోషిస్తుందా? లోకానికి తనతో పనిలేనప్పుడు, తనకు లోకంతో మాత్రం ఏంపని? వేరే గత్యంతరం లేనప్పుడు తనలాటి నిస్సహాయకు 'మరోమార్గాన్ని' చూపగలవారెవరి? గొప్ప

ఇళ్ళల్లో చాటుగా, మాటుగా జరిగేవి—పవిత్ర వ్యభిచారాలయితే — ఇవి అపవిత్రాలు — ఇంతేగా తేడా! ఇది త్యాగమే అయినా—లోకం హర్షించదు! తనలాంటి వాడిన పుష్పాలకూడా చెయ్యిజాపే—పెద్దలు ఇంకా నిల్చి వున్నారనే విషయాన్ని ఆమె ఆక్షణంలో తన జీవితంలో మొట్ట మొదటిసారి గ్రహించ గలిగింది! అమృతానికి ఆశపడితే— విషం ఎదురైంది!

"డాక్టర్‌గారూ!" ఆగాడు—అతను.

"వెళ్దాం రాండి"

"ఇష్టమేనా?"

చచ్చిన తనను ఇంకా చావ బాదటం దేనికి? విధిలేక తల వూపింది. డాక్టర్ విజయసూచకంగా చిరునవ్వు నవ్వాడు. ఆకాశంలో చంద్రుడు 'ఇంతకన్న మూలనున్న ముసలమ్మల మీదికి దండయాత్రచేసి కీర్తి సంపాదించొచ్చు' అన్నట్టు వెలవెల బోతున్నాడు!

3

కుర్రవాణ్ని పరీక్షించి—డాక్టర్ ఒక మాత్ర ఇచ్చాడు; కుర్రవాడు దానిని మింగి, బాధగా కళ్ళు మూశాడు.

ఆతురతతో డాక్టర్ ముఖాన్ని చూస్తూన్న ఆమె, "ఏమండీ?" అంది.

"మరేం ప్రమాదం లేదు"— పెదవి విరిచాడు.

కుర్రవాడు బాధగా, "అక్కా!" అన్నాడు. ఆమె కుర్ర వాడి వెచ్చని శరీరాన్ని తాకింది; వాడు ఆమె చేతిని గట్టిగా పట్టుకున్నాడు.

" ఏం కావాలి నాయనా ? "

"జా—వ !"

"ఇవ్వొచ్చు"— డాక్టరు గొణిగాడు. ఆమె శూన్య దృక్కుల్లో ఇంటివాసాల్ని లెక్కిస్తోంది.

"కాచి ఇవ్వ—" ఏం సమాధానం చెప్తుంది ?

"మాట్లాడవేం ?"

"డబ్బుల్లేవు—"

'అందుకే ఇంత సులభంగా నాకు లొంగావు' అన్నట్టు చూస్తూ, డాక్టరు జేబులోంచి ఒక రూపాయి తీసి ఇస్తూ' "తీసుకువెళ్ళు—నేను ఇక్కడే వుంటాను" అన్నాడు.

ఒక్క సారిగా ఆమెలో లేనిశక్తి ఏదో ప్రవేశించింది. ఆమె ఉత్సాహ పూరిత నయనాలు డాక్టర్‌కు కృతజ్ఞతను చూపాయి. ఇంత ధర్మాత్ముడైన వ్యక్తికి తను ఏం త్యాగం చెయ్యకూడదు?...ఆమె కాచి ఇచ్చిన జావ తాగాక తృప్తిగా చూస్తూ—కుర్రవాడు నిద్రపోయ్యాడు.

అప్పటికి వూరంతా మాటుమణిగినా, దూరాన కుక్కల అరుపులూ, సిగ్నల్ కోసం కాచుకు కూర్చున్న ఒంటిగంట ప్యాసింజరు బొంగురుకూతా విన్పిస్తున్నాయి; ఇంటి పక్కనే వున్న భావకవి, జాగారాలుచేసి జాగ్రత్తగా తయారుచేసిన ప్రేయసి భావగీత పరంపరను, చెవికోసిన కుక్కలాగు, ఏడుపు రాగంలో, కీచుగొంతుకతో కంఠస్థం చేస్తున్నాడు.

డాక్టరు మెల్లిగా లేచి, తనవైపుఅమాయకంగాచూస్తూన్న ఆమె చేతిని పట్టుకున్నాడు. ఆమె చేతి స్పర్శకు ఎక్కడెక్కడో దాగివున్న కామధూమాలు, డాక్టర్ శరీరాన్నంతట్నీ

ఆక్రమించుకున్నాయి. ఆమెకుమాత్రం ఆకరస్పర్శ ఒళ్లంతా గొంగళి పురుగులు పాకినట్లనిపించింది; ఏమైతే నేం? తను వాగ్దానం చేసింది ! తన మాటలకు గాలిలో కలిసి, కరిగి పొయ్యే శక్తి లేకపోయింది. అతని మేలుకు తను కృతజ్ఞురాలవ్వాలి. ప్రాణంతో సమానంగా చూసుకుంటూన్న తమ్ముడికి ప్రాణదానం చేసిన ఆతన్ని తృప్తిపరచడం తనవిధి !... కాని, ఆ భర్తతో పాటే శెలవు పుచ్చుకున్న తన యవ్వన రక్తానికి—చలనం కలగటం లేదు; అందుకు ఆమె శరీరంలోని ఏశక్తీ ఆ సమయంలో సహాయపడి వుండదు; ఆమె తన నారీత్వమే భగ్నమైందేమోననుకొని వుండాలి.

ఆమె మౌనానికి డాక్టరు, "ఏం?" అన్నాడు.

"నేను సిద్ధంగానే వున్నాను"—ఆమె గుండెను రాయి చేసుకో గలిగా ననుకుంది. డాక్టరు ఆమెలోకి—నారీత్వాన్ని చిన్న చిన్న మోతాదుల్లో ఇంజక్టు చెయ్యగలననే ధీమాతో వున్నాడు.

ఆ గుడ్డి లాంతరు వెలుగులో, వెదికి వేసారి, ఆమెలో మిగిలివున్న ఆ కాస్త యవ్వన మధువునూ—యీ డాక్టర్ 'భృంగి' నాల్గో జామున బుడబుక్కల పాట వినపడేటంత వరకూ, గ్రోలాడు. ఆమెకు ఇంకా ఏపతివ్రతల కథల పేజీలు కన్పిస్తున్నాయో కాని డాక్టరు చీకి పారేసే మామిడి టెంక లాగు—ఆమెను ఆ చింకి చాపతో పాటే అవలకు తోసేదాకా ఆమెకు తెలివిరా లేదు. చీరను సవరించుకుంటూ, తేలి పోతూన్న కాళ్ళమీద ఆమె లేచి నిలబడ్డది.

కుర్రవాడు "అమ్మా !" అని వికారంగా అరిచాడు.

ఏ ఉమ్మా పలక్కపోయినా, అక్క కుర్రవాడి పక్కలో జేరి, "ఏం నాయనా?" అంది. కుర్రవాడు కక్కిన రక్తాన్ని చూసేప్పటికే ఆమె నిశ్చేష్ట అయి వుంటుంది. ఆమె మాటకు సమాధానం లేదు. కుర్రవాడి శీతల శరీరాన్ని ఆమె స్పృశింప లేకపోయింది !

ఎవరికోసం తను త్యాగం చేసిందో, ఏ ప్రాణికోసం తన నారీత్వాన్ని వినియోగించి, ఒక నూతన వ్యక్తికి భార్యాత్వాన్ని వహించి, అపవిత్రురాలై సహించి వూరుకుందో— ఆ తమ్ముడే తనకు దక్కలేదు !

"డాక్టరుగారూ !" అంది భగ్నస్వరంతో.

ఇంకెక్కడి డాక్టరు ? అవసరం తీరగానే ఆయనగారు వుడాయించిన ద్వారంలోంచి 'బొంయ్'మని వచ్చిన పెనుగాలికి ఆ గుడ్డిలాంతరు రెపరెపలాడి ఆరిపోయింది. దాంతోపాటు ఆమెలో వున్న ఆశాజ్యోతికూడా ఆరిపోయింది. ఆ చీకటి సముద్రంలో ఆమెకు ఇంకేమీ కన్పించటం లేదు. తను చచ్చినా— తన అపవిత్ర దేహాన్ని యీసంఘంలో ఎవ్వరూ-తాకరనే ధృఢనమ్మకంతో, చెట్టుమీది గుడ్లగూబ స్వరాన్ని కూడా వినకుండా ఆమె శాశ్వతనిద్రను వరించింది.

ఏమైనా ఆమె మాత్రం ఒక 'కులట' కింది మారినసంగతీ ఎల్లా వ్యవహరింపబడుతూన్న సంగతీ, నాకూ తెలుసు !

— జూన్, 1940.